సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



'స్వచ్ఛతా హీ సేవ' విజయవంతం చేయాలి

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని అందరి భాగ స్వామ్యంతో విజయవంతం చేయాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి పిలుపునిచ్చారు. - 8లో



సాంకేతిక శిఖరం 'మోక్షగుండం'

ఇంజనీరింగ్ రంగంలో భారత దేశానికి కీర్తి కిరీటంలా నిలిచారు మోక్షగుండం విశ్వేశ్వ రయ్య. ఆయన తన ప్రజ్ఞా పాటవాలతో బీళ్లను సైతం సస్యశ్యామలం చేశారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.3 /25.5

జిల్లాలో శనివారం 25.5 - 34.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



పూల సాగుపై బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

మైదుకూరు : కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో రైతులు వ్యవసాయంలో వచ్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం ప్రవీణ్ కుమార్ అన్నారు. మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన పంటలపై రైతులకు ఐదు రోజులుగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజు శనివారం పలు రకాల పూల సాగు – విలువ జోడింపు విధానాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పంటల సాగులో కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు బాసటగా నిలుస్తుండటం అభినందనీయమన్నారు. కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ పూల సాగులో పాటించాల్సిన భూసార పరిమితులు, ఎరువుల యాజమాన్యం, నేల, విత్తన రకాల అంశాలపై సమగ్రంగా వివరించారు. పై అంశాలను రైతులు పాటిస్తే పూల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ , గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ పూల కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రవాణా, నిల్వ చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. పూల పంటలో విలువ జోడింపు విధానాలు, పరిమళ ద్రవ్యాలు, నూనెలు, సహజ రంగుల తయారీలో ఉపయోగించడంపై వివరించారు. అనంతరం పూల సాగుపై కేవీకే ప్రచురించిన బుక్‌లెట్లను శాస్త్రవేత్తలు, రైతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వనిపెంట ఎఫ్‌పీఓ చైర్మన్ బాల నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విరాళం

వేంపల్లె: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి సింహాద్రిపురం మండలం కంబల్లి గ్రామస్తులు ముల్లుకుంట్ల వెంకటనాగిరెడ్డి, చిన్నపుల్లారెడ్డి రూ.50,116 విరాళం ఇచ్చారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. అనంతరం దాతలను ఆలయ అధికారులు సన్మానించారు.

రేపు, ఎల్లుండి కేవీకేలో రైతులకు శిక్షణ

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రంలో వానపాముల ఎరువుల తయారీపై ఈనెల 16,17 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు 8096688039 నెంబర్‌కు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

రూ.లక్షలు పెట్టి చదవలేం



మధ్యతరగతి కుటుంబానికి చెందిన మా తల్లిదండ్రులు రూ.లక్షలు ఖర్చుపెట్టి మమ్మల్ని చదివించలేరు. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ కోట్లు ఖర్చు చేసి నిర్మించిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రారంభించకపోవడం బాధాకరం. కళాశాల సీట్ల మంజూరు విషయంలో చంద్రబాబు ధోరణి మార్చుకోవాలి. సీట్లు వద్దని తాను రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ సీట్లను రాష్ట్రానికి కేటాయించాలి. డాక్టర్ చదవాలన్నది నా ఆకాంక్ష. కానీ పులివెందులలో కళాశాల ఉన్నప్పటికీ సీట్లు కేటాయించకపోవడం బాధాకరం.
– సింధు, విద్యార్థిని




విద్యార్థులకు అన్యాయం



రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే వైఎస్ జగన్‌కు పేరు వస్తుందని కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. ఈ మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే వందలాది మంది విద్యార్థులకు వైద్య విద్య అందుతుంది. ఇదే క్రమంలో నిరుద్యోగులకు వైద్యశాఖలో అన్ని రకాలైన ఉద్యోగ అవకాశాలు లభించి ఉపాధి కలుగుతుంది. నిధులు లేకున్నప్పటికీ సీఎంగా వైఎస్ జగన్ నిధులను సమకూర్చి మెడికల్ కాలేజీలను నిర్మిస్తే చంద్రబాబు ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. పులివెందుల మెడికల్ కాలేజీకి అనుమతులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం లేఖ రాయడం అప్రజాస్వామికం. – రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్, దుంపలగట్టు, ఖాజీపేట మండలం

నిండుకుండలా..గండికోట

- పూర్తి సామర్థ్యంతో నీటి నిల్వలు
- నాటి వైఎస్సార్ సర్కార్ వల్లే 26టీఎంసీలు నిల్వ
- వైఎస్ జగన్ సర్కార్ కాలువలు విస్తరించడంతో లభించిన కృష్ణా జలాలు
- ప్రస్తుతం ఇన్‌ఫ్లో 9,600 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 8వేల క్యూసెక్కులు
- ఎత్తిపోతల ద్వారా పైడిపాళెం, సీబీఆర్‌కు నీరు



నీటితో కళకళలాడుతున్న గండికోట ప్రాజెక్టు

సాక్షి ప్రతినిధి, కడప : శ్రీశైలం ప్రాజెక్టు వరదనీరు మళ్లించడంతో గండికోట ప్రాజెక్టు నిండుకుండలా మారింది. పూర్తి స్థాయి నీటి నిల్వతో తొణికిసలాడుతోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముందుచూపు ఫలితంగానే కృష్ణాజలాలు మెట్ట ప్రాంతానికి వస్తున్నాయని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వైఎస్ జగన్ హయాంలో నాలు గేళ్లు నిండుకుండలా దర్శనమిచ్చిన గండికోట ప్రాజెక్టు తాజాగా 26టీఎంసీలతో మరోమారు కళకళలాడుతోంది.

ఎగువన కురిసిన వర్షాల మూలంగా వరద జలాలతో జిల్లాలోని ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. వరద జలాలను జీఎన్ఎస్ఎస్ కాలువల ద్వారా జిల్లా ప్రాజెక్టులకు మళ్లించారు. గండికోటకు రోజుకు ఒక టీఎంసీ నీరు వచ్చి చేరుతోంది. ఈక్రమంలో తాజాగా 26టీఎంసీల నీరు నిల్వ చేరింది. ప్రస్తుతం 9600 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండగా, దాదాపు 8వేల క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉంది. మైలవరం ప్రాజెక్టుకు 5వేల క్యూసెక్కులు, ఎత్తిపోతల పథకం ద్వారా చిత్రావతికి 1500, పైడిపాళెంకు 800క్యూసెక్కులు అందిస్తుండగా, జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా వామికొండ, సర్వాయరాయసాగర్ రిజర్వాయర్‌లకు 700క్యూసెక్కులు తరలిస్తున్నా రు. మైలవరం ప్రాజెక్టులో 6టీఎంసీల నీరు నిల్వ చేశారు. ఇన్‌ఫ్లో భారీగా ఉండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా పెన్నాలోకి విడుదల చేస్తున్నారు. కృష్ణా బేసిన్‌లో వరదల కారణంగా వరదజలాలను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు అడుగులేస్తున్నారు. ఆ మేరకు తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో ఎస్‌ఆర్–1, ఎస్‌ఆర్–2 నింపి బ్రహ్మంసాగర్‌కు తరలించనున్నారు. ఇప్పటికే 2టీఎంసీల చొప్పున ఆ రిజర్వాయర్లల్లో నిల్వ ఉన్నాయి. ఎస్‌ఆర్–2లో 2500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అదేస్థాయిలో అవుట్‌ఫ్లో కొనసాగిస్తున్నారు. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ 17టీఎంసీల సామర్థ్యం కాగా, ఇప్పటికే 5టీఎంసీలు చేరాయి. జిల్లా లోని పూర్తిస్థాయి సామర్థ్యంతో రిజర్వాయర్లల్లో నీరు నిల్వ చేయాలనే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.

డాక్టర్ వైఎస్ఆర్ చిత్తశుద్ధి ఫలితమే..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్తశుద్ధి ఫలితమే మెట్ట ప్రాంతంలో కృష్ణా జలాలు నిల్వ సాధ్యమైందని సాగునీటి రంగ నిపుణులు వివరిస్తున్నారు. మెట్ట ప్రాంతంలో కృష్ణాజలాలను పారిస్తే ప్రాంతం సస్యశామలం అవుతోందన్న ముందుచూపు ఫలితంగానే జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నిండుకుండలా దర్శనమిస్తోంది. కాగా, 2004 ముందు అప్పటి సీఎం చంద్రబాబు గండికోట ప్రాజెక్టును నాన్‌ప్రియారటీ జాబితాలో చేర్చారు. జీఎన్ఎస్ఎస్ ఫీజుబిలిటీ లేదని నిర్లక్ష్యం చేసిన చరిత్ర కూడా టీడీపీ సర్కార్‌దే. 2004 తర్వాత జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టులు పురుడు పోసుకున్నాయి. రాయలసీమ కరువు నివారణకు ఇవే శాశ్వత పరిష్కారమని వైఎస్ఆర్ భావించారు. వెరసి వైఎస్సార్ హయాంలో ఆ ప్రాజెక్టులు శరవేగంగా రూపుదిద్దుకున్నాయి.

35ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి

జీఎన్ఎస్ఎస్ కాలువ పనులు 35ఏళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయాయి. సుమారు 70 స్ట్రక్చర్లు నిలిచిపోయాయి. ఈ క్రమంలో వైఎస్ జగన్ వరద జలాలు డ్రా చేసుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అవుకు టన్నెల్ పనులు పూర్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న స్ట్రక్చర్ పనులన్నీ పూర్తయ్యాయి. ఆ పనులన్నీ రూ.300 కోట్లతో వైఎస్ జగన్ సర్కార్ పూర్తి చేసింది. 60కిలోమీటర్లు కాలువ లైనింగ్ పనులు పూర్తయ్యాయి. దాంతో పూర్తి స్థాయిలో నీరు డ్రా చేసుకునే వెసులుబాటు దక్కింది. ఇంకోవైపు చిత్రావతి నిర్వాసితులకు రూ.250 కోట్లు, గండికోట నిర్వాసితులకు రూ.350కోట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించడంతో పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేసుకునే అవకాశం ఏర్పడింది. టీడీపీ సర్కార్ (2014–19)లో గండికోట ప్రాజెక్టులో 12 టీఎంసీలు మించి నిల్వ చేసిన చరిత్రే లేదు. గడిచిన నాలుగేళ్లుగా 26టీఎంసీల పూర్తి స్థాయి నీరు నిల్వ చేసుకునేందుకు వైఎస్ జగన్ సర్కార్ చర్యలే కారణమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



జీఎన్ఎస్ఎస్ కాలువలో పారుతున్న నీరు

వైఎస్ జలయజ్ఞ ఫలితమే



ఈ ఏడు జిల్లాలో వర్షాలు లేకపోయినా గాలేరు–నగరి ప్రాజెక్టులో అంతర్భాగమైన గండికోట జలాశయం, వామికొండ, సర్వరాయసాగర్, పైడిపాలెంతోపాటు మైలవరం వంటి జలాశయాలు కృష్ణా జలాలతో కళకళలాడుతున్నాయంటే ఇందుకు ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్వహించిన జలయజ్ఞ ఫలితమే తప్ప మరొకటి కాదు. 1996 నుంచి 2004 వరకు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు హయాంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు అంగుళం ముందుకు పోలేదు సరికదా వాటిని నాన్ ప్రయారిటీ జాబితాలో చేర్చి కరువు సీమ ప్రజలను పూర్తిగా విస్మరించారు. 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ శాశ్వత కరువు నివారణకు కృష్ణా జలాల మళ్లింపే ఏకైక పరిష్కారమని జలయజ్ఞాన్ని చేపట్టారు. సుమారు 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి గాలేరు–నగరి పనులను శరవేగంగా పూర్తి చేశారు.
– సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షులు, రాయలసీమ కార్మిక కర్షక సమితి

పెండింగ్ పనుల పూర్తే కారణం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గండికోట రిజర్వాయర్‌కు పోతిరెడ్డిపాడు నుంచి సాగునీరు తీసుకొచ్చేందుకు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించారు. అవుకు కాంప్లెక్స్ రిజర్వాయర్ నుంచి టన్నెల్ ద్వారా గండికోటకు సాగునీరు మళ్లించేందుకు అవసరమైన కాలువలు, లైనింగ్ పనులు పూర్తి చేశారు. అలాగే గండికోట ముంపు గ్రామాల ప్రజలకు సముచిత పరిహారాన్ని అందజేశారు.దీని ఫలితంగా గత నాలుగేళ్ల నుంచి రిజర్వాయర్‌లో 26 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నీరు నిల్వ చేసుకుంటూనే వస్తున్నాం.
– లెక్కల వెంకటరెడ్డి, రైతు నాయకులు, మైదుకూరు

రేపటి నుంచి మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

కడప కల్చరల్: మహా ప్రవక్త మహమ్మద్ (సొ.అ.వ) జన్మదిన మాసం మిలాదున్ నబీ సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మిలాదున్ నబీ కమిటీ అధ్యక్షుడు, మాజీ మంత్రి అహ్మదుల్లా తెలిపారు. శనివారం కడప నగరంలోని కమిటీ కార్యాలయంలో ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను సంస్థ ఉపాధ్యక్షులు సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, సహాయ కార్యదర్శి షేక్ నయీమ్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రం నగరంలోని రహమతుల్లా వీధిలో ఉన్న మీలాద్ ఘర్‌లో జష్నే మీలాదున్ నబీ (సల్లెల్లాహు అలైహివసల్లం) ఆధ్యాత్మిక సభ నిర్వహించనున్నామన్నారు. ముఖ్య అతిథిగా కదిరి నుంచి సయ్యద్ షా మీర్ ఖాద్రి షామీరి సాహెబ్, మత గురువు మౌలానా మౌల్వి ముఫ్తీ సయ్యద్ సయిద్ అహ్మద్ బాక్వి సాహెబ్ పాల్గొంటున్నారని తెలిపారు. అలాగే 17వ తేదీన మంగళవారం సాయంత్రం ఆల్ ఇండియా నాతియా ముషాయిరా కార్యక్రమం ఉంటుందని, సభ అధ్యక్షులుగా ఆస్థాన ఏ షహ మీరియ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా మొహమ్మద్ హుస్సేనీ బాషా షామీరి సాహెబ్ పాల్గొంటున్నారన్నారు. అతిథులుగా ప్రముఖ కవులు బెంగళూరు, మైసూరు, రాయలసీమతో పాటు స్థానిక కవులు కూడా పాల్గొంటున్నారని వివరించారు. ముస్లింలు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మిలాదున్ నబీ కమిటీ ప్రతినిధులు

నేటి నుంచి కడప రాయుని పవిత్రోత్సవాలు

కడప కల్చరల్ : కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలను ఆదివారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నామని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో అంకురార్పణం, విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, రక్షాబంధన్, మృత్సంగ్రహణం, అఖండ దీపారాధన తదితర పూజలు ఉంటాయని తెలిపారు.

16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చతుస్థాన ఆరాధన, ద్వారతోరణ, అనంత కళా పూజ, అగ్నిప్రతిష్ఠ, పవిత్రాల ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నిత్య హోమం నిర్వహిస్తామన్నారు. 17న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పవిత్రాల సమర్పణ ఉంటుందని, సాయంత్రం పవిత్ర హోమాలు ఉంటాయన్నారు. 18న ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పవిత్రాల విసర్జనాలు, మహాపూర్ణాహుతి, చతుస్థాన ఉద్వాసనలు, కుంభ ప్రోక్షణ, పవిత్ర విసర్జన, విద్వత్ సంభావణ ఉంటాయన్నారు. సాయంత్రం 4.00 గంటల నుంచి మాడవీధులలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలకు ప్రగతి పందిరి



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న లోకాయుక్త జస్టిస్ పి. లక్ష్మణ్‌రెడ్డి



కేరళ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్. శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అలుమ్నీ అసోసియేషన్

- ప్రతిభావంతులకు గోల్డ్‌మెడల్స్ ప్రకటన
- కళాశాల వరండాల ఆధునికీకరణ బాధ్యతలు
- కళాశాల ప్రగతి కోసం పలువురు ముందుకు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల 75 వసంతాల సిల్వర్ జూబ్లీ వేడుకలు రెండో రోజు శనివారం ఉత్సాహంగా సాగాయి. వేడుకల్లో భాగంగా సమాజంలో గౌరవంగా బతికేలా తయారు చేసిన మా ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో ఉద్ఘాటించారు. రెండో రోజు ఉదయం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కళాశాల నుంచి మహావీర్ జైన్ సర్కిల్ వరకు జాయ్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా కేరళ టూరిజం డిపార్టుమెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్. శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థులంతా ఒకటిగా తయారై ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. రానున్న రోజుల్లో మరింత ప్రగతి సాధిస్తుందన్నారు. ఏపీ విశ్రాంత డీజీ కె. లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ కళాశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. డబ్బు సంపాదించాక దాన్ని సామాజిక అవసరాలకు వెచ్చించాలని దానివల్ల జీవన కాలం పెరుగుతుందన్నారు. హిమాచల్ ప్రదేశ్ విశ్రాంత ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎ.ఆర్.ఎం. రెడ్డి మాట్లాడుతూ పేదల కళాశాల ఆర్ట్స్ కాలేజి అని, ఎంతో మంది నాలాంటి వాళ్లకు ఉజ్వల భవిష్యత్తును ఇచ్చిందన్నారు. ఇక్కడి అధ్యాపకుల అంకితభావం, నిబద్ధత గొప్పవన్నారు. గవర్నమెంటు కాలేజిలో చదివితే ఏమవుతారు అంటే ఇలా సివిల్ సర్వెంట్స్ అవుతారని చెప్పాలన్నారు. పూర్వ విద్యార్థి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఈ కళాశాలలో చదివినవారు విభిన్నరంగాల్లో రాణించారని ఉదహరించారు. కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం ద్వారా నిధులు కచ్చితంగా తెచ్చి ప్రగతి దిశగా తీసుకువెళతామన్నారు. విశ్రాంత తిరుపతి మున్సిపల్ కమిషనర్ పి. మోహన్‌రెడ్డి మా ట్లాడుతూ బీకాం కోర్సులో ప్రతిభావంతులకు బంగారు పతకం కోసం ప్రతి ఏటా రూ.50 వేలు ఇస్తానని ప్రకటించారు. శాసనమండలి మాజీ సభ్యుడు ఎం. వెంకటశివారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువులు నేర్పిన కళాశాలకు ఎమ్మెల్సీగా కొంత రుణం తీర్చుకున్నానని తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రఖ్యాత కథా రచయిత్రి ఉషారాణి మాట్లాడుతూ 'గుప్పెడంత మనసు' టీవీ సీరియల్లో రిషి క్యారెక్టర్‌ను ఆనాటి తమ అధ్యాపకుడి గురించి స్ఫూర్తి పొంది రాసిందేనని.. ఆ రోజుల్లో అధ్యాపకుల ఆదర్శనీయ జీవితం ఎంతగొప్పదో అవగతం చేసుకోవచ్చన్నారు. చైతన్య కెమికల్స్ అధిపతి రామమూర్తి, ఎస్.కె.యూ మాజీ వీసీ ఎం.ఆర్.కె. రెడ్డి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడతూ కళాశాల ప్రతి భావంతుల కోసం శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ఆచార్య బి.ఎల్.ఎస్. ప్రకాష్‌రావు రూ.2 లక్షలు ప్రకటించారని, కళాశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు ఎంతెంత ఇచ్చారనే జాబితాను వెల్లడించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఘనంగా ముగింపు వేడుకలు..

చదువుతోపాటు సమాజ జ్ఞానాన్ని పొందాలి : జస్టిస్ పి. లక్ష్మణ్‌రెడ్డి

విద్యార్థులకు పుస్తక జ్ఞానమే కాకుండా సమాజ జ్ఞానం అవసరం. చదువుతోపాటు సహపాఠ్యేతర కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లోకాయుక్త ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థి జస్టిస్ పి. లక్ష్మణ్ రెడ్డి అన్నారు. కడప గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల 75 వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా నిర్వహించిన ప్లాటినం జూబ్లీ ఉత్సవాల ముగింపు సభ శనివారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ పి. లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ ఆరోజుల్లో నాయకత్వపు లక్షణాలు తమ అధ్యాపకులే అలవర్చారని గుర్తు చేసుకున్నారు. చాలా కాలం తరవాత చదివిన కళాశాలకు రావడం పెద్ద అనుభూతినిచ్చిందన్నారు. వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, కళాశాల ప్రధానాచార్యులు జి.రవీంద్రనాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల సమన్వయకర్త ఆచార్య రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి లయన్ కె. చిన్నపరెడ్డి, రాయలసీమ పాఠశాలల అధిపతి కొండారెడ్డి, రిటైర్డు ప్రిన్సిపల్ సుబ్బి రెడ్డి, ద్రవిడియన్ యూనివర్శిటీ ఆచార్యులు కరీముల్లా తదితరులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల తరఫున లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి తదితరులను ఘనంగా సత్కరించారు.

ఖాళీలు పూరించండి..

- సమగ్రశిక్షలో జిల్లా అధికారితోపాటు ఇతర పోస్టులు ఖాళీ
- నెలలు గడుస్తున్నా వెలువడని నోటిఫికేషన్
- కుంటుపడుతున్న పరిపాలన



కడపలోని సమగ్రశిక్ష కార్యాలయం

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. పోస్టులు భర్తీకాక... పర్యవేక్షణ జరగక విద్యాభివృద్ధి పూర్తిగా అటకెక్కింది. ముఖ్యంగా 'సమగ్రశిక్ష'లో పరిపాలన తడబడుతోంది. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలులో సమగ్ర శిక్ష కార్యాలయం కీలకంగా వ్యవహరిస్తుంది. అలాంటి సమగ్ర శిక్షపై టీడీపీ సర్కార్ శీతకన్ను వేసింది. నెలల తరబడి పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడంలో తాత్సారం చేస్తోంది. జిల్లాలోని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు అధికారితోపాటు అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ , అకడమిక్ మానటరింగ్ అధికారి, ఫైనాన్స్ అకౌంట్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సమగ్రశిక్షలో కీలకమైన పోస్టులే ఖాళీగా ఉండటంతో పథకాలు అమలుతోపాటు పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి ఈ ఖాళీ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా చోద్యం చూస్తోంది. పరిపాలనతోపాటు తమ జీతభత్యాలకూ ఇబ్బందిగా ఉందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అధికారి పోస్టు ...

సమగ్రశిక్షలోనే కీలకమైన పోస్టు జిల్లా ప్రాజెక్టు అధికారి. ఈ పోస్టులో గతంలో ఉన్న జిల్లా అధికారికి తమ ఫారిన్ సర్వీస్ గడువు ముగియడంతో ఎన్నికలకు ముందే సదరు అధికారి తమ మాతృసంస్థకు వెళ్లిపోయారు. దీంతో దాదాపు ఆరు నెలల నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. అలాగే అసిస్టెంట్ ప్రాసెసింగ్ ఆఫీసర్, అకడమింగ్ మానిటరింగ్ అధికారి స్థానాల్లో పనిచేసే వారు కూడా తమ మాతృస్థానాలకు వెళ్లిపోయారు. ఇక ఫైనాన్స్ అకౌంటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశాడు. దీంతో మొత్తంగా సమగ్రశిక్షలో నాలుగు కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కీలకం అకౌంట్ ఆఫీసర్ పోస్టే...

ఫైనాన్స్ పరంగా సమగ్రశిక్ష కార్యాలయంలో అకౌంట్ ఆఫీసర్ పోస్టు అత్యంత కీలకమైన పోస్టు. ఉద్యోగులకు జీత భత్యాలు, పనులకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేయడంతో అభివృద్ధికి సంబంధించిన బిల్లులను సకాలంలో అందిండం వంటి పనులను నిర్వహించాల్సి ఉంది. అకౌంట్ ఆఫీసర్ లేక సమగ్రశిక్షలో పనిచేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

ఖాళీ అయిన ఉద్యోగుల విధులు, బాధ్యతలు ఇలా...

సమగ్రశిక్ష కార్యాలయంలో జిల్లా సమగ్రశిక్ష అధికారి సమగ్రశిక్షలో అమలయ్యే అన్ని పథకాల అమలు, అభివృద్ధితోపాటు ఉద్యోగుల పర్యవేక్షణ, పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు సంబంధించిన పర్యవేక్షణలతో పాటు పలు రకాల కార్యక్రమాల నిర్వహణ ఉంటుంది. అలాగే ఏఎంఓ కూడా పాఠశాలల్లో అకడమిక్ పరంగా చేపట్టే కార్యక్రమాలను పర్యవేక్షించాలి. అలాగే విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులకు శిక్షణలు, అలాకే కాంప్లెక్స్‌ల పరిధిలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పలు రకాల శిక్షణ కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. పీఎంఓ పాఠశాలల పర్యవేక్షణ సంబంధిత పనుల పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ప్రస్తుతం అసిస్టెంట్ ఏఎంఓకే ఈ బాధ్యతలు అప్పగించారు. దీంతో అయనకు పనిభారం ఎక్కువై తీవ్ర ఒత్తిడి ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే అసిస్టెంట్ ప్రాసెసింగ్ ఆఫీసర్ (ఏఎఫ్ఏ) పోస్టు కూడా రెండు నెలల నుంచి ఖాళీగానే ఉంది. దీంతో సమావేశాలకు సంబంధించిన సమచారాన్ని అప్‌లోడ్ చేయడంతోపాటు నాడు– నేడు పనులను అప్‌డేట్ చేయడం వంటి పనులను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పోస్టు కూడా ఖాళీగా ఉండటంతో సంబంధిత పనులన్నీ కుంటుపడుతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి...



సమగ్రశిక్షలో ఖాళీ అయిన పోస్టుల భర్తీ విషయం ఉన్నతాధికారులతో మాట్లాడుతాం. త్వరలో నోటిఫికేషన్‌ను విడుదల కానుంది. నోటిఫికేషన్ రాగానే ఖాళీ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. సమగ్రశిక్షలో ఎలాంటి సమస్య లేకుండా పర్యవేక్షిస్తున్నాం.
– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

క్లుప్తంగా

లడ్డు వేలం పాట



లడ్డును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణం బ్రాహ్మణపల్లె రోడ్డు మారుతి హాల్ సమీపంలో వినాయకుని ఉత్సవ విగ్రహం వద్ద శనివారం వినాయకుని లడ్డు వేలం పాట నిర్వహించారు. శ్రీ ఏకలవ్య వినాయక అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన లడ్డు వేలం పాటలో రూ. 1 లక్ష 8వేల రూపాయలకు అంబకపల్లెకు చెందిన పూజారి హర్షవర్ధన్ రెడ్డి, కమతం మహీధర్‌లు కైవసం చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్ ఆధ్వర్యంలో లడ్డును వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి



ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన చెరువుపల్లి మధు

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అశోక్‌నగర్ సమీపంలో వినాయకుని నిమజ్జన ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి ట్రాక్టర్ కిందపడి చెరువుపల్లి మధు (29) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కడప నగరంలోని బుడ్డాయపల్లికి చెందిన మధు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. వినాయకుడి నిమజ్జనానికి వెళ్లే సమయంలో ప్రమాద వశాత్తు ట్రాక్టర్ కింద పడ్డాడు. మృతుడి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిన్నచౌక్ ఎస్ఐ పి. రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం



ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అధికంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉంటే పేద విద్యార్థులు కూడా ఉచితంగా వైద్యవిద్య కోర్సుల్లో సీట్లు పొంది, వారి తల్లిదండ్రుల కలను సాకారం చేస్తారు. కానీ మంజూరైన కళాశాలలు పూర్తి చేయకుంటే వచ్చే ఏడాది కూడా ఏపీలో సీట్లు పెరగవు. దీంతో పేద విద్యార్థులకు సీట్లు లభించే అవకాశం లేదు. సీటును డబ్బుపెట్టి కొనే స్థితిలో పేదలు , మధ్య తరగతి కుటుంబాల వారులేరు.

–టి.ఎల్.వెంకటేష్, ఏఐవైఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు



చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు మానుకోవాలి



గత ప్రభుత్వం చేసిన మంచి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు చేయడం మానుకోవాలి. ప్రజలకు మంచి జరిగే ఉద్దేశంతో చేపట్టిన ఏ పనులనైనా మంచిగా ఆలోచన చేయాలి. మెడికల్ కళాశాలల పట్ల ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న ద్రోహం క్షమించరానిది. మెడిసిన్ చదువుకునే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీట్లను చంద్రబాబు ప్రభుత్వం తిప్పి పంపించడం మంచిది కాదు. చంద్రబాబు పునరాలోచించి మెడికల్ కళాశాలల ప్రారంభానికి పూనుకోవాలి.

– ఆవుల ప్రసాద్, చిన్నమండెం

సాంకేతిక శిఖరం 'మోక్షగుండం'

- నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి
- ఇంజినీర్ల దినోత్సవం



కడపలోని విశ్వేశ్వరయ్య విగ్రహం

కడప కల్చరల్ : ఇంజినీరింగ్ రంగంలో భారత దేశానికి కీర్తి కిరీటంలా నిలిచారు మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన తన ప్రజ్ఞా పాటవాలతో బీళ్లను సైతం సస్యశ్యామలం చేశారు. నదులపై ఆయన నిర్మించిన ఆనకట్టలు నేటికీ ఆయన ప్రజ్ఞకు తార్కాణంగా నిలిచి ఉన్నాయి. నేడు ఆయన జయంతి. ఈ సందర్భంగా ఆయన గురించి 'సాక్షి' పాఠకులకు ప్రత్యేకం.

మనిషికి కూడు, గుడ్డతోపాటు నీడ కూడా అవసరమే. సమాజం అభివృద్ధి చెందే కొద్దీ ఇళ్లతో పాటు మానవుని మనుగడకు ఎన్నో కట్టడాలు అవసరమవుతాయి. కర్మాగారాలు, ప్రాజెక్టులు, కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలు ఇలా ఎన్నో నిర్మాణాలతో ఇంజినీర్లు తమ ప్రతిభను, ఉనికిని చాటుతూనే ఉన్నారు. తన ప్రతిభతో భారతదేశంలోనేగాక ప్రపంచంలోని మరెన్నో దేశాల ప్రశంసలు పొందిన ఉన్నత స్థాయి ఇంజినీరు మన మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన స్వయం కృషితో ఉన్నత స్థాయి సాంకేతిక ప్రజ్ఞామూర్తిగా పేరు గడించారు. సివిల్ నిర్మాణాలు, నీటిపారుదల, వరదల నివారణ కోసం ప్రత్యేక నిర్మాణాలు ఇలా ఎన్నో విశిష్టమైన కట్టడాల నిర్మాణంతో ఆయన ఇతర దేశాల సాంకేతిక నిపుణుల ప్రశంసలు పొందారు. 1816లో కర్ణాటకలో కోలార్ జిల్లాలో జన్మించిన మోక్షగుండం పూర్వీకులు ప్రకాశం జిల్లాకు చెందిన వారే. బెంగళూరు, పూణేలలో విద్యాభ్యాసం చేసి సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపారు. ప్రత్యేకించి నీటిపారుదల నిర్మాణాలపై ప్రత్యేక అధ్యయనం చేసిన ఆయన ఆ రంగంలో సమకాలీన ఇంజినీర్ల కంటే ఎంతో ఉన్నత స్థానంలో నిలిచారు. 1908లో మైసూరు మహారాజ ఆయనను తమ రాష్ట్రంలోని రాజ్యసభ చీఫ్ ఇంజినీరుగా నియమించారు. ఆయన మార్గదర్శకత్వంలోనే కావేరి నదిపై కృష్ణరాజసాగర్‌ను నిర్మించారు. 1912లో మైసూరు దివాన్ అయ్యారు. కర్ణాటకలో ఆయనదైన ముద్ర గల నిర్మాణాలెన్నో నేటికీ అందరినీ ఆకర్శిస్తూ చెక్కు చెదరకుండా ఉన్నాయి.

జిల్లాలో..

జిల్లాలో వందేళ్లు దాటిన ఎన్నో భవనాలను మనం చూడవచ్చు. బ్రిటీషు కాలం నాటి ఆ భవనాలు నేటికి పటిష్టంగా నిలిచి ఉండడం విశేషం. ప్రభుత్వ పురుషుల కళాశాల, కలెక్టర్ బంగ్లా, ఎస్పీ కార్యాలయం, బంగ్లా, పాత కలెక్టర్ కార్యాలయం, బంగ్లా, , తహసీల్దార్ కార్యాలయం నేటికి నాటి ఇంజినీర్ల ప్రతిభను చాటుతున్నాయి. జిల్లాలో 100 సంవత్సరాలు దాటినా పటిష్టంగా ఉన్న ఎన్నో చర్చి భవనాలను కూడా గమనించవచ్చు.

ప్రతిభామూర్తులు

మన జిల్లాలో కూడా ప్రతిభావంతులైన ఇంజినీర్లు ఉన్నారు. అటు ఇంజినీరింగ్ రంగంతోపాటు ఇతర రంగాలలో కూడా వారు తమదైన శైలిలో అభివృద్ధి సాధిస్తున్నారు. రైల్వేకోడూరు వాసి జీఎస్ నాయుడు యానాంలో సిరామిక్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి ఆర్.రాజగోపాల్‌రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాలలు స్థాపించిన రాజోలి వీరారెడ్డి, రాయచోటి మాజీ శాసన సభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి , రాజంపేట లోక్‌సభ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కూడా ఇంజినీరింగ్ చేసి ఇతర రంగాలలో రాణిస్తున్నారు. పల్లపు ప్రాంతాల్లోని భవనాలను భూమి నుంచి ఆరు అడుగుల ఎత్తు పెంచే వాసుదేవరెడ్డి లాంటి యువ ఇంజినీర్లు, ప్రత్యేకమైన శైలిలో మన రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడులో కూడా చర్చిలను నిర్మించిన వెంకటేశ్వర్లు లాంటి సీనియర్ ఇంజినీర్లు కూడా జిల్లాలో ఉన్నారు. మన జిల్లాకు చెందిన సీనియర్ ఇంజినీరు ఎం.శ్రీరామిరెడ్డి నీటిపారుదలశాఖలో ప్రభుత్వ సలహాదారుగా సేవలు అందించారు. సెంట్రల్ వాటర్ పవర్ కమిషనర్ డైరెక్టర్‌గా రాష్ట్రంలో నీటిపారుదల పథకాల మంజూరు, అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు డిజైన్ స్థాయి వరకు ప్రధానపాత్ర పోషించారు. తెలుగుగంగ ప్రాజెక్టులో అలైన్‌మెంట్ ప్రాజెక్టు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు.

మోక్షగుండం ఆదర్శంగా

మోక్షగుండం విశ్వేశ్వరయ్యపై గౌరవంతో కడప నగరంలో ఇంజినీర్లు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఎల్ఐసీ సర్కిల్‌లోగల ఈ విగ్రహం వద్ద ప్రతి సంవత్సరం ఇంజినీర్ల దినోత్సవ సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. ఎల్ఐసీ సెంటర్‌గా పేరుగాంచిన ఈ సర్కిల్ విశ్వేశ్వరయ్య విగ్రహం ఏర్పాటైన తర్వాత విశ్వేశ్వరయ్య సర్కిల్‌గా మారింది. ఆయన పేరిట సమీపంలోనే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని ఆయనతోపాటు ఆ వృత్తిని గౌరవిస్తూ ఆరాధిస్తున్నారు.

ఆటో బోల్తా పడి వృద్ధురాలి మృతి

వేంపల్లె : వేంపల్లె సమీపంలోని తగేండుపల్లె క్రాస్ వద్ద ఆటో బోల్తా పడి సయ్యద్ కమాల్ బీ (85)అనే వృద్ధురాలు మృతి చెందింది. స్థానిక బిడాల మిట్ట ప్రాంతంలోని పశువుల ఆసుపత్రి వద్ద నివాసం ఉంటున్న సయ్యద్ కమాల్ బీ శనివారం కూలి పనికి తోటి కూలీలతో ఆటోలో వెళ్లింది. అయితే తగేండుపల్లె క్రాస్ వద్దకు రాగానే ఆటోకు చెందిన టైర్ పగలడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న సయ్యద్ కమాల్‌బీ కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వేంపల్లె ఆసుపత్రిలో చికిత్స చేసిన తర్వాత మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో ఆమె మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లైంగిక వేధింపులపై పోక్సో కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలో 15 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో లక్ష్మీనారాయణ అనే వ్యక్తిపై రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. మైనర్ బాలిక ఇంట్లో ఉండగా పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో అతను తీసుకెళ్లాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతనిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

తండ్రి మందలించాడని తనయుడి ఆత్మహత్య



మృతి చెందిన చింతకుంట వెంకట్

ఎర్రగుంట్ల : మద్యానికి బానిసైన తనయుడిని తండ్రి మందలించాడు. దీంతో అతను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎర్రగుంట్లలో చోటు చేసుకుంది. ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. సుందరయ్య కాలనీకి చెందిన చింతకుంట తిరుమలయ్య పెద్ద కుమారుడు చింతకుంట వెంకట్(18) ఫొటో స్టూడియోలో పనిచేస్తున్నాడు. వెంకట్ మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంటికి మద్యం తాగివచ్చాడు. దీంతో తండ్రి మందలించాడు. దీంతో వెంటనే గదిలోకి వెళ్లి తలుపు మూసుకుని ఉరి వేసుకున్నాడు. వెంటనే తలుపులు తట్టి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ తదితరులు



బుగ్గవంకను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ తదితరులు

- భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించాలి
- కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి పిలుపునిచ్చారు. శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా రాజీవ్ మార్గ్ వద్ద నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే మాధవీరెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 1 వ తేదీ వరకు జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ స్థలాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం నిర్వహించి పరిశుభ్రం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించామన్నారు.

అలాగే అర్బన్ పరిధిలో మున్సిపల్ కమిషనర్ ఉంటారన్నారు. వ్యక్తిగత బాధ్యతగా నిర్వహించి అందరూ కూడా చేయి చేయి కలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భవిష్యత్ తరాల వారికి ఒక ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించాలన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలు, వీధులు, మన నగరం పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కోటిరెడ్డి సర్కిల్ వద్ద స్వచ్ఛతాహి సేవ కార్యక్రమ సందర్భంగా మానవహారం నిర్మించి స్వచ్ఛ భారత్ సేవ ప్రతిజ్ఞ చేశారు.

బుగ్గవంకను పరిశీలించిన కలెక్టర్

నగరం గుండా వెళ్తున్న బుగ్గ వంకను సుందరీకరిస్తామని కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం ర్యాలీ ముగిసిన అనంతరం స్థానిక నాగరాజుపేట నారాయణ కాలేజీకి సమీపంలో ఉన్న బుగ్గ వంక బ్రిడ్జి నుంచి వంకను పరిశీలించారు. ఆ ప్రాంతం అంతా ఆయన కలియతిరిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్‌లో ఆపరేషన్ బుగ్గ వంక పేరుతో బుగ్గ వంకను ఆధునీకరిస్తామన్నారు. అందులో ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి నీళ్లు సాఫీగా వెళ్లేటట్లు చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్ర, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరిస్తే ఉద్యమమే

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం మార్చుకోకపోతే ఉద్యమం తప్పదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వైద్యవిద్యను విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు వైఎస్ జగన్ ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టి గత ఏడాది 5 కాలేజీలు ప్రారంభించారన్నారు. ఈ విద్యా సంవత్సరం మరో 5 కాలేజీలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు జపం చేస్తూ వీటితో పాటు మిగిలిన వాటికి మంగళం పాడేందుకు సిద్ధమైందని విమర్శించారు.

కొత్తమెడికల్ కాలేజీలను మొత్తం ప్రైవేటు పరం చేసేందుకు చంద్రబాబు పథకం పన్నారని ఆయన ఆరోపించారు. అందుకే నిర్మాణాలు ఆపివేయడంతో పాటు పులివెందుల మెడికల్ కాలేజీకి మంజూరైన 50 సీట్లు వద్దంటూ లేఖ రాశారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకుండా మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నేరస్తుడితో రాజకీయామా? అంటూ వైఎస్ జగన్‌ను ఉద్దేశిస్తూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో చంద్రబాబును మించిన నేరస్తుడు లేడన్నారు. వరద సహాయక చర్యల్లో ఆయన ఘోరంగా విఫలమయ్యారని, దానినుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మాజీ ఉపాధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, కలసపాడు జెడ్పీటీసీ గురివిరెడ్డి పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లను ప్రభుత్వం తిరిగి ఇవ్వాలి



అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన ఎంబీబీఎస్ సీట్లను తిరిగి ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు పులివెందుల మెడికల్ కళాశాలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కేటాయించిన సీట్లను తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేస్తూ . శనివారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడో కౌన్సిలింగ్‌లో అయినా మెడికల్ సీట్లు పులివెందులకు కేటాయించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నగర అధ్యక్షుడు అరుణ్, నాయకులు తేజ చంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

కొండాపురం : మండల పరిధిలోని బెడుదూరు గ్రామ సమీపంలో ఉన్న చిత్రావతి నది నుంచి శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఒక ట్రాక్టర్‌ను, అలాగే గ్రావెల్ తోలుతున్న జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశవరెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నదిలో నుంచి ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మండలంలోని పెంజి అనంతపురం క్రాస్ వద్ద బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని వెంకయ్య కాలువ సమీపంలోని చిత్రావతి నది నుంచి ఇసుక తీసుకొస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

హనుమంతరెడ్డికి ఎంపీ పరామర్శ



హనుమంతరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్/జమ్మలమడుగు : కూటమి నాయకుల దాడిలో గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరెడ్డిని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పరామర్శించారు. గురువారం కేసు విచారణ కోసం కోర్టుకు హాజరై తిరిగి వెళ్తున్న సమయంలో కూటమి నాయకులు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన హనుమంతరెడ్డిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని సిటీ న్యూరో కేర్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతున్న హనుమంతరెడ్డిని వైఎస్ అవినాష్ రెడ్డి పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కోర్టుకు హాజరై వస్తున్న వ్యక్తిపైనే దాడి చేశారంటే కూటమి నాయకులకు చట్టం పైన ఉన్న గౌరవం ఏ పాటిదో అర్థం అవుతోందన్నారు. ఇప్పటికైనా ఇలాంటి దాడులు ఆపకపోతే కూటమి నాయకులు భవిష్యత్తులో తప్పక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఉన్నారు.

లోక్ అదాలత్ ద్వారానే కేసులకు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి
- జిల్లా వ్యాప్తంగా 3200 కేసులకు పరిష్కారం
- కక్షిదారులకు నష్టపరిహారం రూ.6 కోట్ల 24 లక్షలు చెల్లింపు



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

కడప అర్బన్ : జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకునే రాజమార్గంగా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను 23 బెంచీలను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని కడపలోని జిల్లా కోర్టులో న్యాయసేవా సదన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ మార్గం ద్వారానే కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. దీనబాబు, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె. హేమస్రవంతి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. విజయలక్ష్మి, కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి. గుర్రప్ప, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 3200 కేసులను పరిష్కరించారు. వీటి పరిష్కారం ద్వారా రూ.6,24,18,818 మొత్తం నష్టపరిహారం కక్షిదారులకు చెల్లించారు. మెడికల్ క్యాంపును ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కోర్టు ఆవరణంలో నిర్వహించారు.

రోడ్డు ప్రమాదం కేసులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కోవూరు కృష్ణవేణి అనే బాధితురాలికి నష్ట పరిహారంగా రూ.1,20,00,000 (కోటి 20 లక్షలు) చెల్లించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడల తోడ్పాటు

డీఈఓ మర్రెడ్డి అనురాధ



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్ : మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ పేర్కొన్నారు. శనివారం కడపలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిలా విద్యాశాఖ అధికారి హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం విద్యాబోధనలో తలమునకలై ఉండే ఉపాధ్యాయులకు ఈ పోటీల నిర్వహణ మంచి ఆటవిడుపు లాంటిదన్నారు. ఉపాధ్యాయులకు మానసిక వికాసంతో పాటు, శారీరక శ్రమ కూడా అవసరమన్నారు. పాధ్యాయులు బోధనతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోగలిగితే చక్కగా రాణించగలరన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉపాధ్యాయులకు షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, షార్ట్ పుట్, పరుగు పందెం, వాకింగ్, టెన్నికాయిట్ తదితర క్రీడా పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సుజాత రాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎజాస్ అహ్మద్, చంద్ర ఓబులరెడ్డి, ఎ.శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు రూతు ఆరోగ్యమేరి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.